క్లుప్తంగా

రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ మదిరేపల్లి శివశంకర్

ఎమ్మిగనూరురూరల్: రైతులు పంటల సాగులో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచుకోవాలని మండల వ్యవసాయాధికారి మదిరేపల్లి శివశంకర్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని పార్లపల్లి, రాళ్లదొడ్డి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధిక మోతాదులో రసాయన ఎరువులు వాడకం వలన భూసారం తగ్గిపోయే ప్రమాదం ఉందన్నారు. పంటలకు ఏదిపడితే అవి మందులు కొని పిచికారీ చేసుకోవద్దని, అధికారుల సలహాలు తీసుకొని మందులు పిచికారీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవోలు నరసింహుడు, వినోద్, రసూల్, వీఏఏలు రమేష్, రాజేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సారా తయారీదారుల అరెస్ట్

ఆదోని రూరల్: ఆదోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నాటుసారా తయారు చేస్తున్న ఆదోని పట్టణం వాల్మీకినగర్, హనుమాన్‌నగర్‌లకు చెందిన 8 మందిని అరెస్టు చేసి తహసీల్దార్ ఎదుట హాజరుపరిచినట్లు ఎక్సైజ్ సీఐ ఎస్.కె.జె.సైదుల్ మంగళవారం తెలిపారు. ఇందులో బోయ మురళి, బోయ కార్తికేయ, బోయ లాలు, బోయ సురేష్, బోయ నాగిరెడ్డి, బోయ హరికృష్ణ, జగ్గాపురం ఈరన్న, బోయ రమేష్ ఉన్నారన్నారు. తహసీల్దార్ ఒక్కొక్కరికి రూ.10 వేలు జరిమానా విధించారన్నారు.

బీమా పరిహారం అందజేత

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని అనారోగ్యంతో మృతి చెందిన గొల్ల అనిల్(48) భార్య జి. ఉమకు రూ.4.75లక్షల ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ పరిహారాన్ని ఆదోని బ్రాంచ్ మేనేజర్ సీఆర్. రామానుజమ్ మంగళవారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ పట్టణానికి చెందిన గొల్ల అనిల్ 2023లో కేవలం రూ. 5 వేలు చెల్లించి సరళ స్వధన్ పాలసీ తీసుకున్నాడని తెలిపారు. గొల్ల అనిల్ అనారోగ్యంలో 2024 మార్చి 1వ తేదీన మృతి చెందాడని చెప్పారు. ఇన్సూరెన్స్‌కు మొత్తం రూ.4,75,000 చెక్కును భార్యకు అందజేశారు. సిబ్బంది మాలముని, వెంకటేష్, చంద్ర తదితరులు ఉన్నారు.

జాతీయ స్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక



మహమ్మద్ వలితో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ఎస్‌ఎన్‌ఎస్ జెడ్పీ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న మహమ్మద్ వలి అనే విద్యార్థి విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో 72 కేజీల విభాగంలో వ్యక్తిగత ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఆగస్టు 19, 20, 21 తేదీల్లో జార్ఖండ్ రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు పాఠశాల హెచ్‌ఎం శోభ మంగళవారం తెలిపారు. జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థితో పాటు పాఠశాల పీడీలు వెంకటేష్, బసవరాజు, సుజనకుమారిలను ఆమెతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహబుబ్‌బాషా, తిమ్మప్ప, కరెకృష్ణ, భీమేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నదీతీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కౌతాళం : తుంగభద్ర డ్యాం నుంచి 1.20లక్ష క్యూసెక్కుల నీరు నదికి వదలడంతో తీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు రజనీకాంత్‌రెడ్డి, సీఐ అశోక్‌కుమార్‌లు అన్నారు. మంగళవారం నదీతీర గ్రామాల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు వారి వెంట ఎల్‌ఎల్‌సీ ఏఈ ఈశ్వర్, ఆర్ఐ, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

చెత్త నుంచి సంపద సృష్టించాలి



గోనెగండ్లలో వర్మీ కంపోస్టు ఎరువులను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ తిమ్మక్క

గోనెగండ్ల : చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల ద్వారా సంపద సృష్టించి పంచాయతీలకు ఆదాయం పెంచాలని డీఎల్‌పీఓ తిమ్మక్క అన్నారు. మంగళవారం మండల కేంద్రం గోనెగండ్లలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. చెత్త నుంచి తయారు చేసిన వర్మీ కంపోస్టు ఎరువులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ గ్రామంలో సేకరించిన చెత్త ద్వారా వానపాములతో సేంద్రియ ఎరువులు తయారు చేసి అమ్మకాలు జరుపుతున్నారని తెలిపారు. సేంద్రియ ఎరువులను రైతులు కొనుగోలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ అనంతసేన, ఈఓ సతీష్, సిబ్బంది మలాంగ్, అనిల్ పాల్గొన్నారు.

'ఆడబిడ్డ'లకు వంచన

- కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా అమలుకు నోచుకోని ఆడబిడ్డ నిధి పథకం
- నెలకు రూ.1500 ఇస్తామని ఎన్నికల్లో హామీ
- హామీ నెరవేర్చాలంటే రాష్ట్రాన్ని అమ్మాలని మంత్రి వ్యాఖ్యలు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మహిళలు



గోనెగండ్ల : సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా 19 ఏళ్ల నుంచి 59 ఏళ్లలోపు మహిళలకు ప్రతినెలా రూ.1500 చొప్పున బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ చేస్తామని పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించారు. అయితే ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా ఆ హామీ ఆచరణకు నోచుకోవడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి కారణమైన పథకం అమలు చేయాలని మహిళలు డిమాండ్ చేస్తున్నారు.

గత ప్రభుత్వంలో మహిళలకు పెద్దపీట

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మహిళల చేతికి చేరిన డబ్బు వృథా కాకుండా ఇంటి అవసరాలకే ఉపయోగపడుతుందని భావించి అనేక పథకాల డబ్బును మహిళల ఖాతాకే జమ చేశారు. అమ్మఒడి, వైఎస్సార్ ఆసరా, ఈబీసీ నేస్తం, కాపునేస్తం, సున్నా వడ్డీ, వైఎస్సార్ చేయూత లాంటి అనేక ముఖ్యమైన పథకాలన్నింటినీ మహిళల అకౌంట్లకే జమ చేశారు.

మండలానికి రూ.45 కోట్ల బకాయి..

కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచిపోయినా ఆడబిడ్డ నిధికి సంబంధించిన ప్రస్తావనే లేకపోవడం అనేక అనుమానాలు తావిస్తోంది. 19నుంచి 59 ఏళ్ల లోపు మహిళలకు నెలకు రూ.1500 చొప్పున ఏడాదికి రూ.18 వేలు చెల్లించాల్సి ఉంది. మండలంలో మహిళా లబ్ధిదారుల సంఖ్య దాదాపు 25 వేలు ఉంటుంది. వీరందరికీ ఒక్కొక్కరికి రూ.18 వేల చొప్పున గడిచిన సంవత్సరం బకాయిలు దాదాపు మండలానికి రూ.45 కోట్లు ఎప్పుడు చెల్లిస్తారని మహిళలు ప్రశ్నిస్తున్నారు. ఈ మొత్తాన్ని ఒకే విడతలో చెల్లించడంతో పాటు రాబోయే రోజుల్లో నెల నెలా రూ.1500 చెల్లించాలని మహిళలు కోరుతున్నారు.

అచ్చంనాయుడు వ్యాఖ్యలపై మహిళలు మండిపాటు

ఇటీవల వ్యవసాయ శాఖ మంత్రి అచ్చంనాయుడు ఆడబిడ్డ నిధి పథకం అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్మాలనే వ్యాఖ్యలు చేయడంతో ఆయనపై మహిళలు మండిపడుతున్నారు. అమలు చేయలేనప్పుడు ఎన్నికల ప్రచారంలో ఎందుకు హామీ ఇవ్వాలని మహిళలు నిలదిస్తున్నారు. అధికారమే పరమావధిగా మహిళలను మభ్యపెట్టి ఎన్నికల్లో అమలు కాని హామీలు ఇచ్చి గెలిచారని, అధికారం కోసం ఇంతలా దిగజారుతారని మహిళలు కూటమి నేతలపై మండిపడుతున్నారు.

ప్రభుత్వానిది వంచన



కూటమి ప్రభుత్వం మహిళలను వంచనకు గురిచేసింది. ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా ఆడబిడ్డ నిధి పథకాన్ని అమలు చేయకపోవడం మహిళలను మోస చేయడమే. ఇప్పటికైనా ప్రభుత్వం పథకం అమలు చేసి మహిళల పట్ల చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి.

– బోయ పద్మ, అలువాల, గ్రామం

ఎప్పుడిస్తారో చెప్పాలి



కూటమి ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలను ఎప్పుడు నెరవేరుస్తుందో వెంటనే చెప్పాలి. హామీ ఇచ్చి సంవత్సర కాలం దాటి పోయింది. ఇప్పటికైనా ఇచ్చిన మాట ప్రకారం పథకాన్ని అమలు చేయాలి. దీంతో పాటు ఏడాదిబకాయిలు కూడా వెంటనే చెల్లించాలి.

– రజియా సుల్తానా, గోనెగండ్ల

హామీ నెరవేర్చాలి



సూపర్ సిక్స్‌లో భాగంగా ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం ఆడబిడ్డ నిధి పథకాన్ని అమలు చేయాలి. పేద మహిళలకు వెంటనే నెలానెలా రూ.1500 ఇవ్వాలి. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా మాకు ఇచ్చిన హామీని నెరవేరుస్తుందని ఆశిస్తున్నాం.

– రమణి కుమారి, గోనెగండ్ల

బాబు హామీలు బూటకం



బాబు మోసాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి మురళీమోహన్ రెడ్డి

కోసిగి: ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలు అంతా బూటకమని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పి.మురళీ మోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు కోసిగి మండలంలోని దుద్ది గ్రామంలో గ్రామ నాయకులు నాగేశ్వర, రామలింగల ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటా తిరుగుతూ బాబు ఎన్నికల ఇచ్చిన హామీలనుఅమలు చేయకుండా చేసిన మోసాలను క్యూఆర్ కోడ్ ద్వారా ఎండగట్టారు. ఉచిత బస్సు, మహిళలకు నెలకు రూ.1500, రైతు సహాయం, నిరుద్యోగ భృతి తదితర హామీల్లో ఏ ఒక్కటి రాలేదని ప్రజలే నేరుగా ఆయనకు విన్నవించారు. ఇటీవల స్కూల్‌లో ఇచ్చిన బ్యాగులు నెలన్నర లోపే పూర్తిగా చినిగి పోయాయని విద్యార్థులు బ్యాగులు తెచ్చి చూపించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈరన్న, షంషుద్దీన్, రహీమ్, బుళ్లి నరసింహులు, కాంట్రాక్టర్ నాగరాజు, గానిగ వీరస్వామి, బసిరెడ్డి, కొరివి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్ల సమస్యలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం



విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న వైఎస్సార్ ఎస్‌యూ నాయకులు

పెద్దకడబూరు : హాస్టల్‌లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆగస్టు 1న కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని వైఎస్సార్ స్టూడెంట్ యూనియన్ జిల్లా జనరల్ సెక్రటరీ నాగేంద్ర, మంత్రాలయం నియోజకవర్గ అధ్యక్షుడు డి.మహబూబ్ అన్నారు. మంగళవారం వైఎస్సార్ స్టూడెంట్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా సంక్షేమ హాస్టళ్ల బాట కార్యక్రమం చేపట్టారు. నాలుగు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో రెండవ రోజు మంగళవారం మండల కేంద్రంలోని బాలుర హాస్టల్‌ను సందర్శించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ హాస్టల్‌లో మౌలిక సదుపాయాలు కరువయ్యాయన్నారు. ప్రధానంగా తాగునీరు లేక స్నానానికి, వాడుకోవడానికి ఉపయోగించే నీటినే తాగుతున్నారని గుర్తించామన్నారు. దుప్పట్లు, నోట్ బుక్స్, ట్రంక్ పెట్టెలు ఇప్పటి వరకు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. హాస్టల్‌కు నైట్ వాచ్‌మెన్ కూడా లేడని, రాత్రి సమయాల్లో విద్యార్థులకు ఏమైనా ప్రమాదం జరిగితే ఎవరి బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. వార్డెన్ కూడా వారానికి రెండుసార్లు మాత్రమే వస్తున్నట్లు గుర్తించామన్నారు. సమస్యలన్నింటినీ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే వరకు పోరాడుతామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ స్టూడెంట్ యూనియన్ మండల ఉపాధ్యక్షులు పూజారి రాజు, మబ్బు రమేష్, కార్యదర్శులు ప్రవీణ్, దస్తగిరి, సుభాన్, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు వేగవంతం చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్

ఆదోని రూరల్: రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను వేగవంతం చేసి ప్రజలకు త్వరితగతిన సౌకర్యం కల్పించాలని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సబ్‌కలెక్టర్ ఆదోని పట్టణంలోని డీఎస్పీ కార్యాలయం సమీపంలో ప్రతిపాదిత రైల్వే ఓవర్ బ్రిడ్జి స్థలాన్ని సందర్శించి రైల్వే, మున్సిపల్, ఆర్‌అండ్‌బీ, విద్యుత్ విభాగాల ఇంజినీర్లతో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ రైల్వే ఓవర్‌బ్రిడ్జి పనులు పూర్తి కావడంతో పట్టణంలో ట్రాఫిక్ తగ్గి ప్రజలకు సౌకర్యం కలుగుతుందన్నారు. అందుకే స్థల సేకరణ, ప్లానింగ్, నిర్మాణ సంబంధిత అన్ని పనులను సమన్వయంతో త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్, ఆర్‌అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పద్మనాభరెడ్డి, రైల్వే ఇంజినీర్లు కనకదుర్గరావు, సత్యనారాయణ, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్స్ వేణుసూర్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వై. ప్రదీప్‌కుమార్ రెడ్డి

మంత్రాలయం రూరల్/నందవరం: మండల పరిధిలోని చిలకలడోణ గ్రామానికి చెందిన బోయ మహానంది(46) అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. సోమవారం రాత్రి హాలహర్వి- చిలకలడోణ గ్రామాల మధ్య 167వ జాతీయ రహదారిలో కారు బైకును ఢీకొనడంతో బోయ మహానంది తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు అంబులెన్స్‌లో ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృత్యువాత పడ్డాడు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై. ప్రదీప్‌కుమార్‌రెడ్డి గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం కుటుంబ సభ్యులకు రూ.20 వేలు ఆర్థిక సాయం అందజేశారు. మృతిడికి భార్య గోవిందమ్మ, నలుగురు కుమార్తెలు ఉన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఆంజనేయులు, నాయకులు వీరేష్ రెడ్డి, హనుమప్ప, డీలర్ రాఘన్న పాల్గొన్నారు.

పాదయాత్రగా ఉరుకుందకు..

కౌతాళం: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా తమ ఇంటి ఇలవేల్పును దర్శించుకునేందుకు మంగళవారం కర్నూలు వద్ద ఉన్న పెద్దపాడు నుంచి 200 మంది భక్తులు కాలినడకన వచ్చారు. గత 15సంవత్సరాల నుంచి పాదయాత్రగా స్వామి దర్శనార్థం వస్తున్నట్లు వారు తెలిపారు. స్వామి దర్శనానికి పాదయాత్రగా రావడం వల్ల కోరిన కోర్కెలు తీరుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు.

రేపు చేనేత పరిరక్షణ సదస్సు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని పద్మశాలి కల్యాణ మండపం వద్ద ఉన్న తేరు బజారులోని వీవర్స్ సొసైటీ ప్రాంగణంలో గురువారం చేనేత పరిరక్షణ సదస్సును నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర చేనేత జన సమాఖ్య నాయకులు శంకరన్న, బండా నీలకంఠ, నాగరాజు, కామశే గణేష్, రామచంద్ర మంగళవారం తెలిపారు. సదస్సులో చేనేత కార్మికులతో పాటు ప్రజాస్వామ్యవాదులు, మేధావులు, ప్రజా సంఘాల నాయకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

వ్యక్తి ఆత్మహత్య

గోనెగండ్ల : మండల పరిధిలోని గంజిహళ్లి గ్రామానికి చెందిన బోయ నరసింహులు(50) అనే వ్యక్తి కడుపునొప్పి తాళలేక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ విజయభాస్కర్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు గంజిహళ్లి గ్రామానికి చెందిన బోయ నరసింహులుకు భార్య మీనాక్షి, ముగ్గురు కుమారులు ఉన్నారు. వీరు గ్రామంలో వ్యవసాయ పనులతో పాటు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే నరసింహులు కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడేవాడు. చికిత్స చేయించుకున్నా నయంకాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది సోమవారం ఉదయం ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు నరసింహులును చికిత్స నిమిత్తం కర్నూలు ఆస్పత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

కోసిగి: మండల పరిధిలోని మూగలదొడ్డి గ్రామానికి చెందిన నాగరాజు, అశోక్ బైక్ పై వెళ్తూ అదుపు తప్పి కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. మంగళవారం గ్రామం నుంచి మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం బైక్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా డి.బెళగల్ గ్రామ రోడ్డులోని బాట మారెమ్మ దేవి ఆలయ సమీపంలో కల్వర్టు వద్ద బైక్ అదుపు తప్పి కింద పడిపోయారు. నాగరాజుకు హెల్మెట్ లేక పోవడంతో తలకు తీవ్ర గాయమైంది. అశోక్‌కు స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. క్షతగాత్రులను 108లో ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

డీఎస్పీ ఉపేంద్రబాబుకు సన్మానం

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని బాబు ఫంక్షన్ హాల్‌లో కర్నూలు దిశ పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వెళ్తున్న సబ్ డివిజన్ డీఎస్పీ ఉపేంద్రబాబుకు మంగళవారం రాత్రి పోలీసు అధికారులు ఘనంగా సన్మానించారు. డీఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి బదిలీ సర్వసాధారణమన్నారు. అయితే పనిచేసే ఎక్కడైన అంకిత భావంతో పనిచేస్తే ప్రజల మన్ననలు పొందవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో సీఐలు శ్రీనివాసులు, మధుసూదన్‌రావు, రామాంజనేయ, మంజునాథ్, విజయబాస్కర్, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతానికి కృషి



ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న నాగలదిన్నె వైఎస్సార్‌సీపీ నాయకులు

నందవరం : వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతానికి కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి (పార్లమెంట్ సభ్యులు) ఎర్రకోట జగమోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డిని నాగలదిన్నె గ్రామానికి చెందిన నాయకులు రాజేష్ శెట్టి, ఈరన్న శెట్టి, కేతం నాగప్ప శాలువా, పూలమాలలతో సన్మానించారు. ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, కార్యకర్తలకు అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రంగన్న, షేక్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల కోసం మభ్యపెట్టిన కూటమి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కామర్తి నాగేషప్ప

ఎమ్మిగనూరుటౌన్: ఓట్ల కోసం ప్రజలను మభ్యపెట్టిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కామర్తి నాగేషప్ప, 2వ వార్డు కౌన్సిలర్ అంపమ్మ, చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు ఎంకే శివప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్ అన్నారు. మంగళవారం పట్టణంలోని 1,2, 3,4 వార్డుల్లో చంద్రబాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. క్యూఆర్ కోడ్ గురించి వార్డు ప్రజలకు వివరించారు. వారు మాట్లాడుతూ.. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం జగనన్న నేతన్న నేస్తం కింద మగ్గం వున్న ప్రతి చేనేత కుటుంబానికి వంద యూనిట్ల ఉచిత విద్యుత్‌తో పాటు రూ.24వేలు ఇచ్చారని, దీంతో చేనేత వృత్తిని వదులుకున్న నేతన్నలు మళ్లీ తమ వృత్తిలో కొనసాగారని గుర్తు చేశారు. నేతన్న నేస్తం డబ్బుతో చేనేత కార్మికులు ముడి సరుకులు కొనుగోలు చేసే శక్తి పెరిగి వస్త్రాలు నేసి ఆర్థికంగా బాగుపడ్డారన్నారు. అయితే అందుకు భిన్నంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అయినా ఒక పింఛన్ మాత్రం పెంచి తల్లికి వందనం పథకం అరకొరగా అమలు చేసి నేతన్నలకు ఇస్తామన్న 200ల యూనిట్ల విద్యుత్ నేటికి అమలు చేయలేదన్నారు. మిగిలిన సంక్షేమ పథకాలన్నీ గాలికి వదిలేశారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ చంద్రశేఖర, జిల్లా సాంస్కృతిక విభాగం కార్యదర్శి రుద్రాక్షాల బజారి, అంగన్‌వాడీ విభాగ జిల్లా కార్యదర్శి సావిత్రమ్మ, పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు లతారెడ్డి, పట్టణ ఉపాధ్యక్షులు బజారిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి



విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయిస్తున్న మూడవ పట్టణ సీఐ రామలింగప్ప

ఆదోని సెంట్రల్: మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల వంటి వాటికి దూరంగా ఉండాలని మూడవ పట్టణ సీఐ రామలింగప్ప. ఈగల్ క్లబ్ ఎస్ఐ సుజన్ కుమార్ అన్నారు. మంగళవారం ఆదోని పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ప్రిన్సిపాల్ మురళీ మోహన్ అధ్యక్షతన డ్రగ్స్ వద్దు బ్రో అనే కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ చెడు అలవాట్లకు బానిసలై ఎంతోమంది విద్యార్థులు తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. తల్లిదండ్రులు ఏ ఆశయంతో మిమ్మల్ని కళాశాలకు పంపుతున్నారో అది మరిచి ఇష్టాను సారంగా జీవించడం సరికాదన్నారు. మాదక ద్రవ్యాల వాడకం ద్వారా వచ్చే దుష్పరిణామాలు, శిక్షలను వివరించారు. కార్యక్రమంలో ఈగల్ క్లబ్ సభ్యులు ఎలీషా, మస్తాన్ వలి, రమేష్ వైస్ ప్రిన్సిపాల్ బాలస్వామి, ఎన్ఎస్ఎస్ అధికారులు జోనాథన్ వీక్లిఫ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌పై అవగాహన

పట్టణంలోని పురపాలక ఉన్నత పాఠశాలలో ఈగల్ క్లబ్స్ ఆధ్వర్యంలో డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈగల్ క్లబ్స్ ఎస్ఐ సుజన కుమార్, టూ టౌన్ ఎస్ఐ రామ్‌నాథ్ పాల్గొని మాట్లాడారు. అనంతరం విద్యార్థుల చేత మాదక ద్రవ్యాలపై చర్చ వేదికను నిర్వహించారు. అందులో చురుకుగా సమాధానా లు చెప్పిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధాకర్, ప్రహ్లాద్, లోక్యనాయక్, రమేష్ రావు, నిరంజన్, సురేష్ కుమార్, హమాద్ హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

ఆదోని సెంట్రల్: డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరడానికి ఆసక్తి కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీ మోహన్ మంగళవారం తెలిపారు. కళాశాలలో 17 కోర్సులు ఉన్నాయన్నారు. దరఖాస్తులు ఆఫ్‌లైన్ విధానంలో బుధవారం నుంచి కళాశాలలో సమర్పించాలని కోరారు.

ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ ఎన్నిక

కోసిగి: మండల పరిధిలోని జుమ్మలదిన్నె గ్రామంలో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం గ్రామంలో ముందుగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ తాలూకా కో ఇన్‌చార్జ్ ప్రతాప్ కుమార్ మాదిగ నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేశారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా బాబు రాజు, మాదిగ పెద్దలు, యువకులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సామేల్, జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గప్ప మాదిగ, నాయకులు కొట్టాల దేవన్న, చింతకుంట నాగరాజు, కోడి ఉరుకుందప్ప, వందగల్లు నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు విడుదల చేయాలి

ఆదోని సెంట్రల్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు అందించాల్సిన డీఏ, సరెండర్ లీవ్స్ వంటి బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ పురపాలక ఉపాధ్యాయుల సమాఖ్య కార్యదర్శి ప్రతాప్ రెడ్డి అర్థిక కార్యదర్శి కోటన్న డిమాండ్ చేశారు. మంగళవారం భోజనం విరామ సమయంలో ముఖ్య కార్యదర్శుల నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో బసవరాజు, సురేష్ కుమార్, జంగం బసవరాజు, ఎల్లాగి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రాజకీయ శిక్షణ తరగతులు

మంత్రాలయం రూరల్ : సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన రాజకీయ శిక్షణ తరగతులు మంగళవారంతో ముగిశాయి. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో రెండు రోజులుగా శిక్షణ తరగతులు చేపట్టారు. మంగళవారం శిక్షణలో జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యుడు నారాయణ మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రధాన సమస్యలను గుర్తించి ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ ప్రాంతీయ నాయకులు తిక్కన్న, మండల కార్యదర్శి జయరాజు, తదితరులు పాల్గొన్నారు.

'చలో విజయవాడ'ను జయప్రదం చేయండి

గోనెగండ్ల: ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆగస్టు 7న చేపట్టే చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భీమేష్ చౌదరి, డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు ప్రవీణ్, జావిద్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని హెచ్. కైరవాడి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పోస్టర్ ఆవిష్కరించారు. ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ అందరూ తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శీను, పోతప్ప, యూనుస్, పవన్, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలి

నందవరం : సాగు పంటల్లో రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని ఏఓ సరిత సూచించారు. మంగళవారం మండల పరిధిలోని పెద్దకొత్తిలి గ్రామంలో వ్యవసాయ అధికారుల ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పంట నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ..భూసార పరీక్షల ఆధారంగా రైతులు సాగు పంటలలో ఎరువులు వాడాలన్నారు. అలాగే సాగు పంటలో వ్యవసాయ అధికారులు సలహాలు, సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ రాఘవేంద్ర, దివ్య, రాణి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వృషభ'రాజు'లు



నందవరం : తాడే లేదు.. తలుగే లేదు.. అయినా సేద్యంలో మెరిగిన వృషభాలు 7 గంటల్లో 10 ఎకరాల గుంటక పాసి శభాష్ అనిపించుకున్నాయి. మంగళవారం మండల పరిధిలోని పోనకలదిన్నె గ్రామానికి చెందిన రైతు కాంట్రాక్టర్ సుంకన్న ఎద్దులు ఉదయం 6.30 గంటలకు పత్తి పొలంలో గుంటక పాసి మధ్యాహ్నం 1:30 గంలటకు పూర్తి చేశాయి. ఏడు గంటల్లో 10 ఎకరాలు పత్తి పంటలో తాడు, జతికేలు లేకుండా గుంటక పాసాయి. దీంతో రైతు సుంకన్నను, వృషభాలను ఊరేగింపు నిర్వహించారు.

మౌలిక వసతులు సమకూర్చడంతో విఫలం



మాట్లాడుతున్న వైఎస్సార్ విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు బలరామ్ యాదవ్

ఎమ్మిగనూరుటౌన్: సంక్షేమ హాస్టళ్లలో మౌలిక వసతులు సమకూర్చడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని వైఎస్సార్ విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు బలరామ్‌యాదవ్ విమర్శించారు. మంగళవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హాస్టళ్లకు సొంత భవనాలు లేకపోవడంతో అద్దె భవనాల్లో విద్యార్థులు అరకొర వసతులతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. పట్టణంలోని బాలికల హాస్టల్‌లో గదుల కొరతతో పాటు విద్యార్థినుల సంఖ్య ఎక్కువగా వున్నందున ట్రంక్‌లపై రాత్రి నిద్రించే దుస్థితి ఉందన్నారు. హాస్టల్‌లో మరుగుదొడ్లు, గదులు, మంచాలు, మంచినీటి వసతి, విద్యుత్ సౌకర్యాలను కల్పించాలని కోరారు.

అన్నదానానికి రూ.50వేలు విరాళం



దాతకు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: ఉరుకుంద గ్రామంలో ఈరన్న స్వామి దేవాలయం వద్ద నిర్వహిస్తున్న శాశ్వత నిత్యాన్నదానానికి మంగళవారం భక్తులు విరివిగా విరాళాలు అందజేసి తమ భక్తిని చాటుకున్నారు. కర్నూలు వాస్తవ్యులైన శివరామ కృష్ణయ్యశెట్టి కుటుంబ సభ్యులు రూ.50వేల నగదు రూపంలో అందజేసినట్లు అందజేసినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలను చేయించి స్వామి వారి తీర్థప్రసాదాలను, పూలమాల, స్వామి వారి శేష వస్త్రాలు, లడ్డులు, బాండును, ఫొటోను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు లోకరాజ్ ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.